# ఎదురు గాలి

మా రంగనాథం బాబాయికి అయిదుగురు మగబిడ్డల తర్వాత లేక లేక ఒక్క కూతురు. అమ్మాయి పేరు లీల. స్వభావంచేత వట్టి బేల. పరికిణీలు వదిలి పెట్టి పమిటె వేసుకునే వయస్సు. వాయిల్ చీర వలయాల్లో వంకరలు తిరిగిపోతూ, భుజంపైనుంచీ జారిపోయే జడను, రొమ్ముకు హత్తించుకొన్న మోపెడు పుస్తకాలను మాటిమాటికి సర్దుకుంటూ సెల ఏటి ఇసుక తిన్నెలపైన తారట్లాడే హరిణశాబకంలా రోడ్డుపైన నడిచిపోతున్న లీలావతిని చూచినప్పుడల్లా ఈ అమ్మాయి కిప్పుడిప్పుడే పెళ్ళి చేయడం భావ్యం కాదనుకునేవాణ్ణి. ఒక్కింత సుఖానికీ, అంతకు రెట్టింపు బాధ్యతలకూ తావలమైనది వివాహానంతర జీవితం. సుఖం మాట దేవుడెరుగుగానీ, ఆ బాధ్యతల బరువును మోయడం సామాన్యం కాదు. అందునా ఆడబిడ్డ విషయంలో అత్తగారి ఆరడీ, ఆడబడుచుల పోరులాంటి చిల్లర మల్లర గొడవలు బోలెడు! ఈ బొమ్మను తీసుకెళ్ళి ఆ ఫ్రేమ్‌లో ఇరికించడమంటే ఎవరికి మాత్రం మనస్కరిస్తుంది?

కానీ మా రంగనాథం బాబాయి సంగతి వేరు. సాధారణంగా సామాన్య మానవుడి ఆలోచన ఎక్కడైతే ఆగిపోతుందో, అక్కడినుంచీ ఆయన ఆలోచన ప్రారంభమవుతుంది. సలహాలను మూటకట్టుకుని ఆయన దగ్గరకు వెళ్ళిన శ్రేయోభిలాషి ఆకాశయానాన్ని గురించి రష్యావాడికి బోధింప దలచుకున్న విదేశీయ వైజ్ఞానికుడులా ముఖం చిన్నబుచ్చుకుని బయటికి రావలసి ఉంటుంది. మా రంగనాథం బాబాయి అప్రమత్తుడు. గొప్ప చలన చిత్రంలో అడుగడుగునా ద్యోతకమయ్యే దర్శకుడి ప్రతిభలా అరవై యేండ్ల జీవిత గ్రంథంలో ఏ పుటను తీసి పరిశీలించినా, ఆయన అప్రమత్తత కొట్టవచ్చినట్టుగా గోచరిస్తుంది. అయిదుగురు కొడుకులు గదా బాబాయికి – శాంతాదేవి ప్రభావానికి లోబడిన నాటి ఋష్యశృంగుని నకళ్లుగా వాళ్ళనయినా పెంచిన తీరు, పరీక్షల్లో కడతేరకముందే వాళ్ళకు ఉద్యోగం రిజర్వు చేసి ఉంచడంలో ఆయన వ్యక్త పరచిన దూరదృష్టి, కన్యాకనకాలతోపాటు అంతో ఇంతో స్థిరాస్థికూడా కలిసి వచ్చేట్టుగా వాళ్ళకు పెండ్లి సంబంధాలు కుదర్చడంలో ఆయన ప్రకటించిన లౌక్యం – ఇవన్నీ మా బాబాయి విజ్ఞతకు తార్కాణమే! తోలుబొమ్మలాటలో సూత్రధారిలాంటివాడు మా బాబాయి. మూలవిరాట్టుగా ఆయన ఉన్న చోటునుంచి కదలడు ఎలా జరిగిపోతాయో మరి, అన్ని పనులూ ఆయన అనుకున్నట్లుగానే జరిగిపోతాయి.

బ్యాంకులో ఉన్న డబ్బులాగా లీలావతి భవిష్యత్తు మా బాబాయి పిడికిట్లో సురక్షితంగా ఉందని నాకు తెలుసు. కానైతే ఆ భవిష్యత్తును ఆయన ఎప్పుడు ఏ విధంగా ఆవిష్కరించగలడో నాకు తెలియదు.

ఓరోజు సాయంత్రం మా బాబాయి నాకు కబురు పెట్టాడు. వెళ్ళగానే ఆదరణ వాక్యాలతో ఉపచరించాడు. మాటల సందర్భంలో "చూడు శేఖరం! నేనింతవరకూ

ఎవరితోనూ సంప్రదించలేదనుకో! అమ్మాయికి వీలైనంత త్వరగా పెళ్ళి చేయాలను కొంటున్నాను. నీ అభిప్రాయమేమిటి?" అంటూ సూటిగా ప్రశ్నించి నీటుగా కుర్చీలోకి వాలిపోయాడు.

నేను తబ్బిబ్బు పడిపోయిన మాట నిజం! పుట్టిన తర్వాత ఇంత కాలానికి మా బాబాయికి ఓ నరమానవుడి సలహా కావలసి వచ్చినదంటే ఆ మాట నెమ్మనాన నమ్మదగింది కాదు. అమ్మాయిని తీసుకెళ్ళి ఓ కట్టు కూసానికి కట్టబెట్టినా అదే తమ బావమరిది అనుకోడానికి మా బాబాయిగారి కుమారపంచకం తయారు! తన మొగుణ్ణి తానే ఎన్నుకో కలిగేపాటి వయస్సు, చొరవ, తెలివితేటలూ లీలావతి కేలాగు లేనేలేవు. మా బాబాయికి సలహా ఇవ్వగలిగినంతగా ఈ మధ్య నాలో వివేకం పరిణతి చెంది ఉంటుందన్న నమ్మకం కూడా నాకు బొత్తిగాలేదు. కాగా పోగా కుర్రవాడికి కాస్తా పెద్దరికమిచ్చి మన్నన చేయాలనుకుంటున్నాడేమో మా బాబాయి...

నా ఊహ నిజమే! మా బాబాయి ఒకరి సలహాకోసం పడిగాపులుబడి కూర్చోలేదు. ఆ దశను దాటుకొని ఆయన ఆలోచన ఎంతో దూరం ముందుకు సాగిపోయింది.

"నా ఎరుకలో ఓ మంచి సంబంధం ఉంది శేఖరం!"

ఉలికిపడ్డాను. "ఉందా బాబాయ్? ఇంకేం? శుభస్య శీఘ్రం అన్నారు కానిచ్చేయకూడదూ?" అన్నాను. అన్నానా? నా అభిప్రాయానికి విరుద్ధంగా నేనలా అనడమేమిటి? మా బాబాయిలోని ఏదో బలీయమైన శక్తి నా నోటంట అలా అనిపించి వుంటుంది.

"కుర్రాడు ఎమ్మేదాకా చదువుకున్నాడు..."

ఆ తరువాత చదువుకోడానికి ఏముంది? ఏమీలేదు. పరీక్షల తుఫానుల్లో నుంచీ చదువుల సముద్రాన్ని అవతలి గట్టుదాకా ఈది, గడిచి గట్టెక్క గలిగాడు. గనుకనే ఆ కుర్రవాడు మా బాబాయికి అల్లుడు కాగలిగిన అవకాశానికి నోచుకున్నాడు.

"ఇంతవరకూ నిరుద్యోగేననుకో! కాని ప్రయత్నిస్తే ఆదిలోనే గెజిటెడ్ ఉద్యోగంలాంటి దేదైనా దొరక వచ్చు...."

అయితే ఇప్పుడిప్పుడే ప్రయత్నించకపోవడం మంచిది. వరవిహీనపు పెళ్ళికొడుకు లాగా పెళ్ళిచేసుకోక మునుపే గెజిటెడ్ ఆఫీసరు కావడమేమిటి?

"కుర్రవాడికి చెప్పుకోదగిన పెద్ద దిక్కెవరూ లేరు. ఓ తల్లి మాత్రం ఉంది. ఆవిడ కూడా కాటికి కాళ్ళు సాచుకున్న ముసల్ది..."

బాబాయి దృష్టిలో మంచి సంబంధానికి కనీసపు అర్హతలేమిటో నాకు క్రమక్రమంగా అవగతమవుతున్నాయి.

"ఆ కుర్రాడి దగ్గర్నుంచి ఈరోజే ఓ ఉత్తరం అందుకున్నాను. వచ్చి అమ్మాయిని చూచుకోవాలట!"

"ఇది మరీ బాగుంది! అమ్మాయిని చూడ్డం గూడానా బాబాయ్! అంతగా అవసరమైతే సంధ్యాదీపాన్నీ, చంద్రబింబాన్నీ, శతపత్ర సుందరినీ చూచుకోమని వ్రాయలేకపోయావా?" అన్నాను. మా బాబాయి మనసులోని ఉల్లాసానికొక చక్కిలిగింత పెట్టాలని నా ప్రయత్నం.

ప్రయత్నం ఫలించింది. కొండరాతి దగ్గర ప్రవాహంలా మా బాబాయి ముఖంలో ఆనందం నురగలు కట్టింది. "కుర్రకుంక! వాడికంత ఘాటుగా వ్రాయడమెందుకు లేరా శేఖరం! రేపు శుక్రవారం గాక మళ్ళీ వచ్చే శుక్రవారం నాటికి దినశుద్ధి బాగా ఉందనీ, వచ్చి చూచుకోదలచుకుంటే మన అభ్యంతరమేమీ లేదనీ ఈరోజు టపాకే ఓ కార్డు ముక్క వ్రాసి పడేశాను..." అన్నాడు బాబాయి.

తాను సూత్రధారిగా ఇదివర కెప్పుడో ప్రారంభించిన నాటకానికి నన్నొక ప్రేక్షకుడుగా ఆహ్వానిస్తున్నాడన్నమాట మా బాబాయి! నాకు ఆశాభంగం కలిగిన మాట వాస్తవం. మా బాబాయి నాటకాల్లో మచ్చుకొకదానిలోనైనా నాకొక చిన్న పోర్షన్ లభిస్తే బాగుండునన్నది నా చిరకాల వాంఛ. ఆ ఆశ ఈ దఫాగూడా అడియాసే అయిపోతూంది...

కానీ ఘటనాఘటన సమర్థుడు మా బాబాయి. అంతలో నా ఆశకు జీవం పోశాడు.

"నాకు పంచపాండవుల్లా అయిదుగురు కొడుకులున్నారనుకో శేఖరం! కానీ ఏం లాభం? ఒక్కడూ అక్కరకు పనికి రాడు. అమ్మాయి పెళ్ళంటే అది కాస్తా వెనకా ముందూ చూచుకోవలసిన వ్యవహారం. ఇందులో నీ తోడ్పాటు నాకు చాలా అవసరం!"

నా తోడ్పాటా! బాబాయి కవసరమా? నా చెవుల్ని నేనే నమ్మలేకపోయాను.

"నిజమేరా శేఖరం! చదువుల్లో ఏముంది? ఖర్చుకు తట్టుకోగలిగితే ఎమ్మే కావడం కష్టం కాదు. ఇక సిరిసంపద లంటావా? ఎవరో తాత ముత్తాతలు గడించి పెట్టిపోతే అందులో వీడి నిరవాకం ఏముంటుంది? చదువు సంగతీ, ఆస్తిపాస్తుల సంగతీ అలా ఉంచు. మనిషికి ముఖ్యంగా కావలసింది ప్రయోజకత్వం. అవతలి మనిషి చూపులకోసం వస్తే, ఇవతలి వాళ్ళు కళ్ళు మూసుకుని కూర్చోవాలని అర్థం కాదు. బంగారంలాంటి అమ్మాయి నిస్తున్నామా? పదివేల రూపాయల కట్నం పోస్తున్నామా? సరకు నాణెం తెలుసుకోకుండా పిల్లనిస్తారా ఎవరైనా? కుర్రాణ్ణి కాస్తా కదిలించి లోతులు ఆరా తీయాలి. మనిషిలో యే మాత్రం చేవవుందో కనుక్కోవాలి."

అమ్మో, ఏమిటో అనుకున్నానుగానీ బాబాయి నాటకంలో నాది కీలక పాత్ర! జ్వరమాపకంతో టెంపరేచరును నిర్ధారించినట్టుగా ప్రయోజకత్వాన్ని కొలవడానికి మా బాబాయి నన్నొక సజీవ సాధనంగా వాడుకోదలుచుకున్నాడు. జీవిత నాటకంలో ఎప్పుడు ఏ పాత్ర లభించినా అందుకు సిద్ధంగా ఉండాలి మానవుడు! వెనుకాడితే పెదవి విరచి నువ్వు పనికిరావని తేల్చేస్తారు డైరెక్టర్లు. నలుగురైదుగురు డైరెక్టర్లు అలా తేల్చి పారేసిన తర్వాత నటుడికి నేలపైన నూకలుగూడా పుట్టవు.

❋ ❋ ❋ ❋

దినశుద్ధి బాగున్న శుక్రవారం రానే వచ్చింది. అబ్బాయి గూడా విచ్చేశాడు.

అతడికి పాతికేళ్ళుంటాయి. బక్కపలచటివాడు. తెల్ల జామపండు వంటి దేహచ్ఛాయ, అందమైన క్రాపింగు, ముచ్చటైన ముఖారవిందం, నలగని దుస్తులు, కస్తూరిబొట్టు పెట్టి, తలకు పాగా చుట్టి, మెడకొక పూల దండ తగిలిస్తే అతడప్పటి కప్పుడే పెళ్ళికొడుకైపోయేటట్టున్నాడు.

బంగారంలాంటి పిల్ల. పదివేల రూపాయల కట్నం. ఈ ఊహల సులోచనాలలో నుంచీ చూస్తే అతడు టెక్నికలర్ చిత్రంలో హీరోలా మరింత భువన మోహనంగా గూడా ఉన్నాడు.

అన్నట్టు అతగాడి పేరు రఘుపతి.

రఘుపతి పుణ్యమా అని నాకాపూట మా బాబాయిగారింట్లో షడ్రసోపేతమైన విందు భోజనం. భోజనానంతరం విశ్రాంతి. సేదదీరి లేవగానే మళ్ళీ టిఫిన్, రఘుపతి కెలా ఉందోగానీ నామట్టుకు నాకు మత్తుగా వుంది. నేనలా మత్తులో వుండగానే పెళ్ళిచూపుల తతంగం ప్రారంభమైంది. పచ్చటి చీరకట్టుకుని, తెల్లటి జాకెట్టు తొడుక్కున్న లీలావతి తామరాకు పొత్తర్లలో నారద మహర్షి దివినుంచీ భువికి తెచ్చిన పారిజాత పుష్పంలా వుంది. సదరు పారిజాత పుష్పం తాలూకు పరిమళంలా లీలావతి వీణాగానం మధురాతి మధురంగా విస్తరిల్లుతూంది. అందరి చూపులూ అమ్మాయిపైన! బాబాయి చూపులు మాత్రం నిర్విరామంగా అబ్బాయిని అజమాయిషీ చేస్తున్నాయి. ఉదయం తొమ్మిదిగంటల కనగా వచ్చాడు రఘుపతి. అప్పటినుంచి అతడి పెదవుల కవాటాల్ని తెరచుకొని బయటపడిన మాటలనన్నిటినీ లెక్కించుకొని సరాసరి లెక్కవేస్తే అతడు గంటకొకటి రెండు మాటలు మాట్లాడి వుంటాడు. అవిగూడా – అవును, కాదు, ఓహో, అలాగా, నిజమే – లాంటి పొడి మాటలు. లీలావతి పాడుతూంది. ఎల్లోరా గుహాలయంలో గంధర్వుడి శిల్పంలా నిశ్చలంగా కూర్చున్నాడు రఘుపతి. ఆనందమో, పరవశత్వమో, నిర్లిప్తతతో ఫలానా భావమని అంతుచిక్కడం లేదుగానీ, మొత్తంపైన అది చెక్కుచెదరని గంభీరముద్ర!

వారగా పిలిచి ఆ గంభీర ముద్రకు వ్యాఖ్యానం చెప్పమన్నాడు బాబాయి! ఏమని చెప్పను? మౌనం మహనీయుల లక్షణమని చెప్పనా! లేక మూఢ మానవులకు భూషణమని చెప్పనా?

దీప దీపాలవేళ షికారు వెళ్ళి రమ్మన్నాడు బాబాయి? "షికారుకా? సరే, పదండీ" అన్నాడు రఘుపతి దారిలో మాటలు లేవు. ఊరు దాటుకుని విజన ప్రదేశంలో ఓ బండపైన కూర్చున్నాము.

"మీకేమైనా హాబీలున్నాయటండీ?" అంటూ ప్రసంగానికి ఉపక్రమించాను.

"హాబీలా! అవి నా కెందుకండీ?" అన్నాడు రఘుపతి – అప్పటికవేమో అంటరాని అప్రాచ్యపు వస్తువులైనట్లు! "పోనీ పుస్తకాలు చదువుతారా?" అన్నాను. "పుస్తకాలు ప్రకటించడంలో పబ్లిషర్ ఉద్దేశ్యం మన బోటివాళ్ళు చదవాలనే గదండీ!" అన్నాడు అమాయకంగా రఘుపతి. "సినిమాలు చూస్తారా?" అన్నాను. "చూడకపోతే ఎలాగండీ! మా ఊళ్లో ఏడెనిమిది థియేటర్లున్నాయి. మనం చూడకపోతే వాళ్ళ గతేం కావాలి?" అంటూ జాలిని ఒలకబోశాడు రఘుపతి. ఎలాంటి రచన రుచిస్తుంది? ఎవరి నటన బాగుంటుంది? – మొదలైన ప్రశ్నల గొలుసుకట్టుతో ప్రసంగాన్ని సాగదీశాను. సాగదీయగా నాకు తెలిసిన విషయం ఒక్కటే – రఘుపతి ఏ ప్రశ్నకూ సజావుగా సమాధానం చెప్పడు!

చెప్పడా? చెప్పలేడా? – అదే నా సందేహం.

ఆకాశాన నక్షత్రాలు, ఊళ్ళో విద్యుత్‌దీపాలు వెలుగుతున్నాయి. తేమగా ఉన్న భూమిపై నుంచి తడితడిగా గాలి వీస్తుంది. మాటల మధ్యలో వుండి వుండి దగ్గుతున్నాడు రఘుపతి. ఒకసారి రెండు నిమషాలుదాకా అతడు దగ్గును నిలుపు కోలేక పోయాడు. "రాత్రంతా రైలులో ప్రయాణం చేశాను గదండీ? కిటికీలోంచి వెలుపలికి చూస్తూ కూర్చోవడం నాకో అలవాటు! రాత్రి వీచిన చలిగాలంతా నా పాలే అయింది. తెల్లవారేసరికి ముక్కులు మూసుకుపోయాయి. అమాంతంగా జలుబు పట్టేసింది" అంటూ అతడు తన అనారోగ్యానికొక సంజాయిషీగూడా చెప్పుకున్నాడు.

ఇంటికి వెళ్ళగానే భోజనాలు వడ్డించేశారు. హాల్లో వరుసగా మూడు మంచాలు వేయించాడు బాబాయి. పడుకున్న అయిదు నిమిషాలకే రఘుపతి ముసుగు బిగదన్నుకున్నాడు. అతడు ఆవులిస్తాడేమోనని బాబాయి పాపం ఓపినంతసేపు కాచుకుని కూర్చున్నాడు. ఆవులించలేదు. సరికదా, పల్లు పలకరించకుండా నిద్రపోసాగాడు రఘుపతి.

బాబాయి ప్రేవులు లెక్కబెట్టడానికి వీల్లేకపోయింది.

హఠాత్తుగా మేలుకున్నాను. ఇంకా తెల్లవారలేదు. చీకట్లో నీడలా కూర్చుని మంచం నవార్లు కదిలిపోతూండగా దగ్గుతో సతమతమవుతున్నాడు రఘుపతి. నేను మేలుకున్న కాసేపటికి బాబాయి కూడా మేలుకొని మంచం దిగి లైటు వేశాడు. పిన్నిని పిలిచి నీళ్ళు కాచుకు రమ్మన్నాడు. పెట్టె తెరచి మాత్ర తీసుకొచ్చాడు.

"గడిచిన రాత్రంతా రైల్లో ప్రయాణం చేశాడా బాబాయ్? చలిగాలి తగిలి జలుబు పట్టింది. కొత్తనీళ్ళు త్రాగడంలో ఆ జలుబులో నుంచే దగ్గు పుట్టుకొచ్చింది. ఏం చేస్తుంది? గుక్కెడు మందు త్రాగితే అదే పోతుంది..." అన్నాను.

కానీ బాబాయికి నా మాటలపైన నమ్మకం కలిగినట్లు లేదు. ఆయన అనుమానంగా నావైపు చూచి మళ్ళీ అదే అనుమానంతో రఘుపతికేసి చూడసాగాడు.

❁ ❁ ❁ ❁

రఘుపతి పెళ్ళి చూపులకోసం వచ్చి వెళ్ళిపోయిన తర్వాత నిండుగా నాలుగు మాసాలు గడిచిపోయాయి. వెళ్ళుతూ వెళ్ళుతూ స్పష్టంగా తన అంగీకారాన్ని ప్రకటించి వెళ్లాడు రఘుపతి. అందువల్ల పెళ్ళి విషయంలో జరిగిన ఈ నాలుగు మాసాల విలంబనానికీ రఘుపతిని కారకుడుగా భావించడానికి వీలయింది కాదు.

నాలుగైదు సార్లు బాబాయిని అడిగి చూచాను. అడిగినప్పుడల్లా ఆయన "పెళ్ళికదా! వెనుకాముందూ చూచుకోవాలి గదా!" అని సాగదీస్తూ వచ్చాడు.

చివరికొకసారి "ఆ అబ్బాయి నీకు నచ్చలేదా ఏమిటి బాబాయ్?" అని నిలదీసి అడిగాను కూడా. ఆయన చిరునవ్వు నవ్వి ఊరుకున్నాడు.

కారణం ఏమయితేనేం? బాబాయి ఆ సంబంధంపట్ల సుముఖంగా లేడని అనుకోవలసి వచ్చింది. ఏవో వైమనస్యాలవల్ల ఒక్కొక్కప్పుడు పీటలపైకి వచ్చిన పెళ్ళిళ్ళే ఆగిపోతూ ఉంటాయి. వాటితో పోల్చి చూస్తే ఇదెంతో నయం! అదీగాక మానవుడి నిర్ణయా లన్నిటిపైనా నుదుటిరాత అన్నదొక్కటి ఉండనే ఉంది! అదెలా ఉంటే అలా జరుగుతుందను కోవడం ఆలోచనలకన్నింటికీ హద్దు. నా ఆలోచనకూడా ఆ హద్దు దగ్గరే ఆగి పోయింది.

అనుదిన వ్యాసంగాల అలజడిలో కాలనిర్ణయం లేకుండా వాయిదా పడినట్టు తోచిన లీలావతి పెళ్ళి సంగతి విస్మరించి నా గొడవల్లో నేనుండగా ఓ రోజు రాత్రి యెనిమిది గంటలప్పుడు సుడిగాలిలా విరుచుకు పడ్డాడు బాబాయి.

"అదేమిట్రా శేఖరం? అవతల నేను పెళ్ళి ఏర్పాట్లలో సతమతమై పోతూండగా ఒకసారి ఇంటిదాకా వచ్చే ఓపరికమైనా లేదా నీకూ? ఇదేనా నువ్వుచేసే తోడ్పాటు?" అని రుసరుసలాడుతూ కుర్చీలో కూర్చున్నాడు.

సైడు యాక్టరు చక్కగా నటించకపోతే రంగస్థలం పైన ప్రముఖ నటునికి చిరాకు కలగడం సహజం! అందుచేత నేనుకూడా నా పాత్రను సక్రమంగానే నిర్వహించ దలచుకున్నాను.

ఉత్తపుణ్యానికి నా మీద అపవాదు వేస్తే నీకు పాపం చుట్టు కుంటుంది బాబాయి! పెళ్ళిచూపుల తర్వాత నువ్వు మనసు విడిచి నాతో మాట్లాడిందెప్పుడు? నువ్వు పెళ్ళి ఏర్పాట్లు చేస్తున్నావని నాకేం తెలుసు?" అంటూ నేను ముఖం ముడుచుకున్నాను.

లాలనగా నాపైకి ఓ సాదరపూర్వకమయిన దరహాసాన్ని వెదజల్లాడు బాబాయి.

"నువ్వింతటి అమాయకుడి వనుకోలేదురా శేఖరం! ఈ నాలుగు మాసాలుగా నేను గోళ్ళు గిల్లుకుంటూ కూర్చున్నాననుకున్నావా నువ్వు! నీకు తెలియకుండా ఎంత కథ జరిగిందీ, ఏం కథా..."

ఆ కథా, కమామీషూ వినాలనే ఉంది నాకు. కానీ కుతూహలం వ్యక్త పరచవలసిన అవసరం లేకపోయింది. చెప్పడానికే వచ్చాడు బాబాయి.

"ఆ అబ్బాయి వచ్చి వెళ్ళిపోయాడా శేఖరం? వెంటనే ముహూర్తం పెట్టించమని మీ పిన్ని కూడా గోల పెట్టింది. కానీ నాకు మాత్రం అడుగు ముందుకు పడింది కాదు. సందేహం కలగనే కూడదు, కలిగితే అది నివృత్తి అయేదాకా నాకు నిద్రపట్టదు. ఆ కుర్రాడు బక్కపలచటివాడు. దగ్గుతున్నాడు. అందుకేదో కారణం కూడా చెప్తుతున్నాడనుకో. కానీ యెలా నమ్మగలం చెప్పు? నువ్వెప్పుడైనా కోడెల బేరం చూశావా శేఖరం బేరగాడు పలువరుస చూస్తాడు. రొమ్ము వాటం చూస్తాడు. ఒంటిపై సుళ్ళున్నాయేమో చూస్తాడు. ఇన్నీ చూచిన తర్వాత ఓ మోపుదు గడ్డివేసి వాటి భోజనం పుష్టిని పరిశీలిస్తాడు. మహాచేస్తే అయిదు వందలు చేయని ఎద్దు గొడ్లకే ఇన్ని పరీక్షలు ఉండగా ఠంచనుగా పదివేలు పోస్తూ మనం మొహమాటాలకు పోవడం ఏం సబబు? వెయ్యి రకాలుగా ఆలోచించి ఆఖరుకు నేనొక నిర్ణయానికి వచ్చాను. ఇందువల్ల సంబంధం బెడిసిపోయినా సరే అందుకు నేను సిద్ధపడ్డాను. వీడుకాకపోతే వీడిని తలదన్నె వాడింకొక డనుకున్నాను. తెగించి ఓ ఉత్తరం వ్రాసేశాను..."

"ఏమని వ్రాశావు బాబాయ్?" విస్మయంతో ప్రశ్నించాను.

"ఏముందీ? - ఇదిగో అబ్బాయ్! సందేహం ప్రాణసంకటం అంటారు నాకిలాంటి సందేహం కలిగింది. దీన్ని నివృత్తిచేసే బాధ్యత నీది. మరేంలేదు. ఒకటి రెండు ఎక్సరే ఫోటోలుతీసి పంపిస్తే చాలు - అని వ్రాశాను. వ్రాసిన పదో నాటికల్లా నాచేతిలో ఫోటోలున్నాయి..."

కృష్ణపరమాత్ముడి విశ్వరూపం ఎదుట మ్రాన్పడిపోయిన కౌరవ రాజ్య నివహంలా మా బాబాయి బుద్ధిబలం ఎదుట నేను రిచ్చపడిపోతున్నాను.

"సరే - మన డాక్టరు దామోదరం లేదా శేఖరం? పరిశీలనార్థం ఫోటోలను ఆయన దగ్గరికే తీసుకెళ్ళాను. ఆయన పరీక్షించి చూచి "ఏమిటండీ మీరు మరీనూ! అప్పటి అపరంజిలాంటి ఆరోగ్యవంతుడిపైన అపోహను రగిలించుకోవడం తగునా మీకు?" అంటూ కోపగించుకోపోయాడు."

తలపైనుంచీ పెద్ద భారాన్నీ ఎవరో దించుకున్నట్టుగా నేను వేడిగా నిట్టూర్చాను. కొద్ది నిమిషాలకు మునుపు నా కళ్ళ ఎదుట గిర్రున తిరగ సాగిన ప్రపంచం మళ్ళీ యథాస్థితికి వచ్చినట్టయింది. బాబాయి మాత్రం చెక్కుచెదరకుండా తన ప్రసంగాన్ని కొనసాగిస్తున్నాడు.

"అంతలో ఏమైంది శేఖరం? రసవత్తరమయిన కథంతా ఇకముందే ఉంది. మనిషి కేమీ జబ్బులేదని నిర్ధారించుకున్నామనుకో! కానీ మనిషి లోపలి మనసుసంగతేమిటి? ఆ అబ్బాయి వస్తుతః ఎలాంటివాడు? పుట్టు పూర్వోత్తరాలెలాంటివి? వాకబు చేయసాగాను. చేసినకొద్దీ కొత్త కొత్త విషయాలు బయటపడసాగాయి. వీళ్ళ పెదనాన్న ఒకతను పేకాటలో కొంపముంచుకున్నాడు. వీళ్ళ మేనమామ కట్టుకున్న పెళ్ళానికి విడాకులిచ్చేశాడు. వీళ్ళ నాన్నగూడా సన్యాసుల వెంట, మఠాలవెంట తిరుగుతూ సంసారం పైన అట్టే పట్టింపులేకుండా కాలం వెళ్ళబుచ్చేశాడు. మరైతే ఈ అబ్బాయి ఎవరి స్వభావాన్ని పుణికి పుచ్చుకున్నాడు? కూపీ తీశాను. ఒకరు చెప్పినట్టు మరొకరు చెప్పలేదు. అతడి కాలేజీ సహపాఠకుడొకడు 'వాడికి పిల్లనిస్తారా! మితికి మించిన సాధు గర్వితనం ఉందండీ వాడిలో!' అన్నాడు. ఆ కుటుంబంతో బాగా పరిచయమున్న మరొక పెద్ద మనిషి 'నన్నేం చెప్పమంటారండీ? ముఖమేమో పద్మదళాకారం. పలుకేమో చందనశీతలం. హృదయం సంగతి నాకేం తెలుసు?' అన్నాడు. తేనెలోపడ్డ ఈగ చందమయింది నా పని. మతిపోయినంత పనైంది. వారం పది రోజులు అదేపనిగా ఆలోచించాను..."

అబ్బో, బాబాయి ఆలోచన! ముద్గరం, శూలం, కుంతం, కరవాలం లాంటి యుద్ధోపకరణాలు దాని ఎదుట బలాదూరు. అదీసారి ఏం చేస్తుంది? ఏం చేస్తుందో గానీ నా గుండె మాత్రం గుబగుబలాడుతూంది.

"నా ఎరుకలో చూచి రమ్మంటే కాల్చిరాగల మెరికెల్లాంటి మనుషులిద్దరున్నారు. వాళ్ళను పిలిపించి దారి ఖర్చులకు, దినభత్యాలకు డబ్బు లిచ్చాను. ఒప్పగించిన పనిని సక్రమంగా నెరవేరిస్తే ఈనాం గూడా ముట్ట చెబుతానన్నాను. వాళ్లా ఊరికి వెళ్ళి రెండు వారాలపాటు అక్కడే ఠికాణా వేయాలి. ఆ కుర్రాడి ప్రతి కదలికనూ కనిపెట్టాలి. అతడు సాధారణంగా ఎలాంటి వారితో కలుస్తాడు? ఏ విధంగా కాలక్షేపం చేస్తాడు? సన్నిహిత సమాజంలో అతడి కున్న పేరు ప్రతిష్ఠలెలాంటివి?... క్షుణ్ణంగా ఆచూకీ తీయమన్నాను..."

నా స్మృతిపథంలో షెర్లాక్‌హోమ్స్, పెర్రీమేసన్, హర్క్యూల్ పొరెట్ లాంటి సుప్రసిద్ధ అపరాధ పరిశోధకులు మెదులుతున్నారు. ఆ రంగంలో ప్రవేశించ లే దంతేగానీ మా బాబాయి వాళ్ళకేమాత్రం తీసి పోడు!

"చెప్పవలసిందంతే శేఖరం! వాళ్లు తిరిగి వచ్చేశారు. వాళ్లు సేకరించిన భోగట్టాతో బాటు ఆ కుర్రవాడి నడత గూడా నాకు సంతృప్తికరంగా తోచింది." – ఉపసంహారంలోకి వచ్చేస్తున్నాడు బాబాయి. "అమ్మాయి నివ్వడానికి అంగీకారం తెలుపుతూ జవాబు వ్రాశాను. బదులు రాగానే ఆచార్లు గారి దగ్గరికి వెళ్ళి ముహూర్తం పెట్టించాను. ఫైనల్లో అమావాస్య పోయిన పంచమినాడు సూర్యోదయాత్పూర్వం దివ్యమయిన లగ్నం ఉంది. రేపు సాయంకాలానికల్లా ఇన్విటేషన్లు అచ్చవుతాయి. కుమార రత్నాలు బంధువులతో కలిసి సరిగ్గా పెళ్ళినాటికే హాజరవుతారేమో తెలియదు. ఎటు చూసినా నాకు చేదోడు వాదోడుగా ఉండగలిగిన వాడివి నువ్వొక్కడివే కనిపిస్తున్నావు. నువ్వు స్కూలుకు పదిరోజులు సెలవు పెట్టాలి."

ఆఖరి వాక్యం చెబుతున్నప్పుడు బాబాయి ఇంట్లో లేడు. రోడ్డుపైన ఉన్నాడు.

❀ ❀ ❀ ❀

ఆకాశమంత పందిరి, భూదేవంత వేదిక గాకపోయినా, కడకాకికిగూడా నేతి వంటకాలే మిగలకపోయినా ఉన్నంతలో ఘనంగానే జరిగింది పెళ్ళి. వివాహానంతరం వారం రోజులకే లీలావతి కాపురానికి వెళ్ళిపోయింది.

ఒకటి రెండు రోజులు మాత్రం ఎలాగో ఓపిక బిగపట్టగలిగాడు బాబాయి. మూడోనాటి ఉదయం నుంచీ ఆయన పోస్ట్‌మన్‌కోసం వేచి చూడసాగాడు. ఎలా ఉందో అమ్మాయి? కొత్త వాతావరణంలో దిగులుపడి పోయిందేమో? అత్తగారి అధికారం క్రింద కోడంటికం అనుభవిస్తున్నదేమో... కుమార్తె యోగక్షేమాలు తెలుపవలసిందని కోరుతూ ఆయన రెండు రోజుల కొకటి చొప్పున అల్లుడికి ఉత్తరాలు వ్రాయసాగాడు. కానీ ఆయన శ్రమంతా 'వన్‌సైడ్ ట్రాఫిక్' అయిపోయింది. అల్లుడి దగ్గరినుంచీ ప్రత్యుత్తరమే లేదు.

ఆఖరికొక సుదీర్ఘమైన ఉత్తరం వ్రాయడానికి పూనుకున్నాడు బాబాయి. ఆ బిడ్డను మోయడం, కనడం దగ్గరనుంచీ ప్రారంభించి, మమకారాలకు ఆకరముగా పెంచడం, ముద్దు ముచ్చటలకు హద్దుగా ప్రేమించడం మున్నగు విషయాలను వివరించి, చిట్టచివరకు తమ బిడ్డపైన అంతగా ప్రాణాలను పెట్టుకున్న తల్లితండ్రులు కుమార్తె క్షేమాలను గురించి ఓ కార్డుముక్కకైనా నోచుకోకపోవడం హృదయ విదాకరమని మరీ మరీ వాపోయాడు.

"నా అంబులపొది ఖాళీ అయిపోతూందిరా శేఖరం! చివరి దిదే... బ్రహ్మాస్త్రము! దీనికిగూడా బదులు లేకపోతే, ఇక ఆశలు లేనట్టే!" అంటూ ఆయన కుర్చీలో క్రుంగిపోయాడు.

ఈ ఉత్తరానికి తిరుగు టపాలోనే ప్రత్యుత్తరం వచ్చింది. కానీ వచ్చినదాన్ని ప్రత్యుత్తరమనడం చప్పగా ఉంటుంది. బాబాయిది బ్రహ్మాస్త్రమైతే అందుకు బదులుగా వచ్చింది బ్రహ్మ శిరోనామకాస్త్రం!

"ప్రియమైన మామగారికి నమస్కారానంతరం రఘుపతి వ్రాయునది...

తపాలా శాఖవారి సౌజన్యంవల్ల మీ జాబులన్నీ సక్రమంగా చేరుతున్నాయి. వాటిలో మిగిలినవన్నీ ఒక ఎత్తు అయితే చివరి జాబుమాత్రం ఒక ఎత్తు. అందులో కన్న కూతురిపట్ల తల్లిదండ్రుల అనురాగాతిశయాన్ని గురించి మీరు వ్రాసిన ఆణిముత్యాల లాంటి మాటలను

ఒకటికి రెండుసార్లుగా చదువుకున్నాను. మీ కుమార్తెకు గనుక ఒక కుమార్తె గలిగితే ఆ బిడ్డను పెంచి పెద్ద జేయడంలో మీ సలహాలను, సూచనలను అక్షరాలా పాటించగలనని హామీ ఇస్తున్నాను. కానీ ఆడబిడ్డకు బదులుగా మీ అమ్మాయికి మగబిడ్డ కలిగితే వాడికి మాతామహుడి లక్షణాలు రాకుండా ఉండాలని మాత్రం భగవంతుణ్ణి ప్రార్థిసున్నాను.

మీకు కోపం రావచ్చు. ఎవరి కోపం వాళ్ళకే శత్రువు. కనుక శాంతంగా సావధానంగా నా యీ మనవి మాటల్ని అవధరించగలరని కోరుతున్నాను.

పితృపంచకంలో పిల్లనిచ్చిన పెద్ద మనిషిగూడా ఒకడని శాస్త్రాలు చెబుతున్నాయి. ఆ విధంగా మీరు నాకు పూజ్యులు. కాని ఆ పూజ్య భావాన్ని అటుంచి నిర్మొహమాటంగా ఆలోచించినట్టయితే మీలో తోటి మానవులు సహించడానికి వీల్లేని అవగుణాలు కొన్ని ఉన్నాయని తెలియజేయడానికి మిక్కిలి విచారిస్తున్నాను.

ఎంతోకొంత తెలివి తేటలతో భగవంతుడు ప్రతి మానవుణ్ణి ఈ భూలోకం పైకి పంపుతున్నాడు. ఉన్న తెలివి తేటలతో జీవితాన్ని సుఖప్రదంగా మలచుకోడానికి ప్రయత్నించడం మానవ సహజం. కానీ లోకంలో ఉన్న తెలివి తేటలన్నీ తమకే ఉన్నాయనీ, మిగిలిన వాళ్ళందరూ బొత్తిగా తెలివిమాలిన వాళ్ళనీ భావించడం ఈ ఊహకు అనుగుణంగానే ప్రవర్తించడం... ఇది అనాదిగా కొందరు మానవుల్ని అంటిపెట్టుకొని వున్న అజ్ఞానం. ఈ అజ్ఞానం మీలో పుష్కలంగా ఉంది.

వివాహ నిర్ణయాలు పై లోకంలో జరుగుతాయంటూ ఒక సామెత ఉంది. ఈ శైలాంభోనిధి జంతు సంయుతమైన ధరాచక్రం గూడా తమ ఇష్టాయిష్టాలకు అనుగుణంగానే పరిభ్రమిస్తున్నదని అనుకోగలిగిన బుద్ధిమంతులకు ఇదొక చాదస్తపు మాటగానే తోచవచ్చు. చాతుర్యాన్నంతా వెచ్చించి మీ కుమార్తెకొక మంచి సంబంధాన్ని కుదుర్చుకోగలిగినట్టు భావిస్తుంటారు మీరు! కానీ నేను పంపిన ఎక్స్‌రే ఫొటోలు నాకు సంబంధించినవి కావని చెబితే మీరేం చేస్తారు?

రాజ్యాంగ సూత్రాల ప్రకారం నేరం చేయని వాడిపైన నేరాన్ని ప్రతిపాదించడం నష్టపరిహారం కోసం కోర్టుదాకా లాక్కెళ్ళే వ్యవహారం. ఏమి నేరం చేశానని నాపైకి సి.ఐ.డీ.లను పంపుతారు మీరు? మీ అమ్మాయిని పెళ్ళాడడానికి అంగీకరించడమేనా నా నేరం?

పోనీ... ఈ నేరస్తుడి ఆంతరంగిక జీవితాన్ని శోధించడానికి మేయబోయి మెడ తగిలించుకోగల అలాంటి ప్రబుద్ధులకంటే మరి కొంచెం నాటురకం పత్తేదారులెవరూ దొరక్కపోయారా మీకు?

మీకు డబ్బుంది. డబ్బున్నదన్న నిబ్బరంతో మానవత్వానికి మూల కందాలైన అమూల్యమైన విలువల్ని మీరు అవమానిస్తారు. సుఖ జీవన సౌలభ్యం కోసం మానవుడు సృష్టించుకున్న ఒకానొక వినిమయ వస్తువు డబ్బు. మీరా డబ్బుకు వినిమయంగా మనుషులకు మనుషులనే కొనేయ వచ్చునని భావిస్తారు. మీ అమ్మాయి అందచందాలను, గుణగణాలను చూచి ఆమెను నేను సహధర్మిణిగా వరించి ఉంటానని మీరనుకోరు. మీ కట్నానికి కక్కుర్తిపడి, మీ అనుమానాల బోనులో నిల్చుని, మీ సందేహాల కన్నింటికీ

సంజాయిషీ లిచ్చుకున్నానని ఊహిస్తారు. నేను మనిషిని. వస్తువును కాను. నన్ను మీరు కొనలేదు, కొనలేరు. ఈ జాబుతో పాటు మీ పదివేల రూపాయలను మీకు చెక్కు రూపంలో త్రిప్పి పంపుతున్నాను.

ఐతే వివాహం కాకమునుపే నేనెందుకు కట్నాన్ని నిరాకరించలేదని మీ కిక్కడొక సందేహం కలుగవచ్చు. అందుకు కారణం చెబుతున్నాను. కట్నాన్ని నిరాకరించడం అదొక ఉదారాశయంగా భావింపబడుతున్న రోజులు గావు. అది వరుడి అనర్హతగా పరిగణింపబడుతున్న దుర్దినాలు. అజ్ఞాతంగా ఏదో భయంకరమైన లోపం దాగి ఉండకపోతే, వరుడెందుకు కట్నాన్ని కాలదన్నుకుంటాడని మీరే కాదు, మీతోబాటు లోకులు గూడా అనుమానిస్తారని నాకు తెలుసు.

చి.సౌం. కుం. లీలావతి కులాసాకేమీ లోటులేదు. లేదంటే అప్పుడప్పుడూ మీరు కళ్ళల్లో మెదులుతున్నారని చెబుతూంది. వీలు చూచుకుని మీరొకసారి అత్తగారితో సహా ఇక్కడికి వచ్చి పోగలిగితే మంచిది. లేదా మేమే అక్కడికి రాగలము.

ఇట్లు, మీ అల్లుడు,

రఘుపతి."

బాబాయి ముఖాన నెత్తురు చుక్క లేదు. కాళ్ళక్రింద నేల కరిగిపోగా ప్రవాహంలో పడి కొట్టుకుపోతున్న కాందిశీకుడి ముఖంలో సైతం అలాంటి నిస్సహాయత కనిపించదు!

♦ *ఆంధ్రప్రభ వారపత్రిక, 1958* ♦